సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025

పాత పాల్వంచ చింతలచెర్వు కట్ట వద్ద గల ఆత్మలింగేశ్వరాలయంలో శివపార్వతుల కళ్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు



న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శివరాత్రి పర్వదినం సెలవు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

వీరభద్రస్వామికి రూ.20లక్షల విలువైన బంగారు కిరీటాలు



బంగారు కిరీటాలు అందిస్తున్న జయశేఖర్ దంపతులు

బూర్గంపాడు: బూర్గంపాడు సమీపాన గోదావరి మధ్యలో మోతెగడ్డపై కాకతీయుల కాలం నాటి వీరభద్రస్వామి ఆలయానికి మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామివారికి తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ – నీలిమ దంపతులు రూ.20 లక్షల విలువైన బంగారు కిరీటాలు, పట్టువస్త్రాలను అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, చిగురుమళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న ఫారెస్ట్ స్టేషన్



బండ్లవారిగుంపులో ఏర్పాటు చేస్తున్న ఫారెస్ట్ స్టేషన్

అశ్వాపురం: మండలంలో మారుమూల ప్రాంతమైన గొందిగూడెం ఫారెస్ట్ సెక్షన్ పరిధి బండ్లవారిగుంపులో ఫారెస్ట్ స్టేషన్ ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. స్టేషన్ కోసం ప్రత్యేక కంటైనర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇందులో ఓ సెక్షన్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు బీట్ ఆఫీసర్లు, ఐదుగురు బేస్ క్యాంప్ సిబ్బంది ఉంటారు. రాత్రి సమయాన కూడా ముగ్గురు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. జిల్లాలో ఇది రెండో ఫారెస్ట్ స్టేషన్ కాగా గతంలో మణుగూరు ఫారెస్ట్ రేంజ్ కూనవరం బీట్‌లో ఏర్పాటు చేశారు.

హరహర మహాదేవ..

జిల్లాలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు ● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



అన్నపురెడ్డిపల్లిలో ఎస్పీ దంపతుల పూజలు



భద్రాచలంలో శివలింగానికి పీఠి అభిషేకం

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే మహా శివుడికి అభిషేకాలు, అర్చనలు ప్రారంభమయ్యాయి. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. రాత్రికి ఆయా ఆలయాల్లో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపించారు. జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలైన అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం, బూర్గంపాడు మండలంలోని మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయం, దుమ్ముగూడెం మండలంలోని చిన్నఅరుణాచల క్షేత్రంతో పాటు ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దమ్మపేట మండలం ముష్టిబండ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయాన్ని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, అన్నపురెడ్డిపల్లి ఆలయాన్ని ఎస్పీ రోహిత్‌రాజ్ దంపతులు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలంలోని శ్రీ జయదుర్గ సహిత పంచముఖ విశ్వేశ్వరస్వామి వారిని ఐటీడీఏ పీఓ రాహుల్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. – నెట్‌వర్క్

9లో



దమ్మపేట: ముష్టిబండ శివాలయంలో భక్తులు (ఇన్‌సెట్) జూలూరుపాడు: పాపకొల్లు ఆలయంలో..

పోలింగ్‌కు రెడీ..

నేడు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్
- ఉమ్మడి జిల్లాలో 47కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు

ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు 47 కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది. జిల్లా కేంద్రాల నుంచి ఉద్యోగులు సామగ్రితో బుధవారం సాయంత్రంకల్లా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.
– సాక్షి ప్రతినిధి, ఖమ్మం



కొత్తగూడెంలోని రామచంద్ర డిగ్రీ కళాశాలలో పోలింగ్ సిబ్బంది కోసం సిద్ధంగా ఉంచిన వాహనాలు



పోలింగ్ సామగ్రితో బస్సు వద్ద సిబ్బంది, పోలీసులు



పోలింగ్ సామగ్రితో బస్సు ఎక్కుతున్న ఉద్యోగులు

ఖమ్మం జిల్లాలోనే ఎక్కువ

ఉమ్మడి జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు 6,111 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,440 మంది, మహిళా ఓటర్లు 2,671 మందితో జాబితా సిద్ధమైంది. జిల్లాల వారీగా చూస్తే ఖమ్మం జిల్లాలో 4,089మంది ఓటర్లకు గాను పురుషులు 2,372 మంది, మహిళలు 1,717, భద్రాద్రి జిల్లాలో 2,022 మంది ఓటర్లకు గాను పురుషులు 1,068, మహిళా ఓటర్లు 954 మంది ఉన్నారు. రెండు జిల్లాలో కలిపి 47 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అత్యధికంగా ఖమ్మం రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగు కేంద్రాలు ఉండగా, 1,986 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఆతర్వాత జలగంనగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 488 మంది ఓటర్లు ఉన్నారు. ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసిన 24 కేంద్రాల్లో సగానికి పైగా ఓటర్లు ఈ కేంద్రాల్లోనే ఓటు వేయనున్నారు. అలాగే, భద్రాద్రి జిల్లాలో ఎక్కువగా భద్రాచలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 250 మంది, ఇల్లెందులోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 210 మంది, చుంచుపల్లిలోని బాబుక్యాంపు బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 175 మంది ఓటర్లు ఉన్నారు.

కేంద్రాలకు చేరిన సిబ్బంది

ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు బుధవారం రాత్రి వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో ఏ.పద్మశ్రీ పర్యవేక్షించారు. ఖమ్మం జిల్లాను ఎనిమిది రూట్లుగా విభజించి సిబ్బందిని ఆర్టీసీ బస్సుల్లో పంపించారు. కాగా, పోలింగ్ కేంద్రాలను పోలీసు బలగాలు తమ ఆధీనంలోకి తీసుకుని కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశాయి. ఎన్నికల విధుల్లో పాల్గొనే 56 మంది పీఓల (ప్రిసైడింగ్ అధికారులు)కు గాను ఖమ్మం జిల్లాలో 28 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 28 మంది ఉన్నారు. వీరు కాక ఏపీఓలు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టార్ అధికారులు విధులు నిర్వర్తిస్తారు. పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్సులను నల్లగొండలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి తరలించేలా ఏర్పాట్లు చేశారు.

ఆ రెండు ప్రాధాన్యతలే కీలకం

ఈ ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు ఉన్నారు. దీంతో ఓటర్లు 1నుంచి 19 వరకు ప్రాధాన్యత ఇస్తూ అంకెల ద్వారా ఓటు వేయొచ్చు. అయితే, 1, 2వ నంబర్ వేసే ఓట్లకే ప్రాధాన్యత ఉంది. ఒకటో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో గెలుపు తేలకపోతే రెండో ప్రాధాన్యత ఓటు లెక్కింపుతో విజేతను ఖరారు చేస్తారు. మొత్తం పోలైన ఓట్లలో 51శాతం వచ్చిన వారినే విజేతగా ప్రకటిస్తారు. 19మంది అభ్యర్థుల్లో ఒకటో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువ వచ్చినా.. పోలైన ఓట్లలో వారికి ఈ ప్రాధాన్యత ఓట్లు 51 శాతంగా ఉంటేనే విజయం ఖరారవుతుంది. అయితే, మొదటి ప్రాధాన్యత ఓట్లలో 51 శాతం ఓట్లు ఎవరికీ రాకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తూ.. తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేట్ చేస్తారు. ఇలా మొత్తం అభ్యర్థుల్లో చివరి వరకు ఎవరికి 51 శాతం ఓట్లు ఉంటే వారినే గెలుపు వరిస్తుంది. ఫలితంగా బరిలో ఉన్న అభ్యర్థులు ఒకటో ప్రాధాన్యత ఓటుతో పాటు రెండో ప్రాధాన్యత ఓటునూ కీలకంగా తీసుకున్నారు. గత ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్లతోనే గెలుపొందిన విషయం విదితమే.

ఓటర్లు, పోలింగ్ సిబ్బంది వివరాలు

జిల్లా	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం	మొత్తం
ఓటర్లు	4,089	2,022	6,111
పోలింగ్ కేంద్రాలు	24	23	47

రెండు జిల్లాల్లో పోలింగ్ సిబ్బంది	పీఓలు	ఏపీఓలు	ఓపీఓ-1, ఓపీఓ-2	మైక్రో అబ్జర్వర్లు	పోలీస్ సిబ్బంది
	56	57	104	56	940

ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత గల ఉపాధ్యాయులంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెం శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం ఆయన అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగుతుందని చెప్పారు. జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలు, ఏడు రూట్లు ఏర్పాటు చేశామని, ఒక్కో రూట్‌కు ఒక్కో సెక్టార్ అధికారితో పాటు ఒక్కో రూట్ అధికారిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఈవీఎంలు ఉండవని, బ్యాలెట్ పేపర్ ద్వారానే ఓటు వేయాల్సి ఉంటుందని, బ్యాలెట్ పేపర్‌పై పోటీ చేస్తున్న అభ్యర్థి పేరు, ఫొటో ఉంటాయని, ప్రాధాన్య క్రమంలో నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో నంబర్లు వేయాలని అన్నారు. ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్ను మాత్రమే వినియోగించాలని, ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్ పాల్గొన్నారు.

'పవర్'ఫుల్ శిక్షణ

- ఆర్టీసీ ఉద్యోగుల్లో వృత్తి నైపుణ్యాల పెంపునకు నిర్ణయం
- రోజుకు 40 మంది చొప్పున 182 అంశాలపై అవగాహన
- రీజియన్‌లోని ఆరు డిపోల్లో తరగతులు



శిక్షణ తరగతుల బ్యానర్



సత్తుపల్లిలో అవగాహన కల్పిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: ప్రయాణికులు మరింత మంది ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేలా సంస్థ అనేక ప్రయత్నాలు చేస్తోంది. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ వారికి సంస్థపై నమ్మకం పెంచడం, తద్వారా ఆదాయాన్ని రాబట్టుకునేలా కార్యక్రమాలు రూపొందిస్తోంది. ఇదేసమయాన ఉద్యోగుల సంక్షేమంపైనా దృష్టి సారించిన యాజమాన్యం ఏటా వైద్యపరీక్షలు నిర్వహిస్తోంది. ఈక్రమంలో ప్రయాణికులతో వ్యవహరించాల్సిన తీరు, ఇతర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించేలా మరో కార్యక్రమానికి రూపకల్పన చేసింది.

రద్దీ నేపథ్యాన...

రాష్ట్రప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో రద్దీ గణనీయంగా పెరిగింది. ఈ కారణంగా కండక్టర్లు, డ్రైవర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లకు విధినిర్వహణ సవాల్‌గా మారిందని చెబుతున్నారు. ఈ నేపథ్యాన ఉద్యోగుల్లో వృత్తి నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించి యజమానిననే భావన కల్పించేందుకు 'పవర్' పేరిట శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల్లో ఈనెల 18వ తేదీన మొదలైన శిక్షణ వచ్చేనెల 2వ తేదీ వరకు కొనసాగనుంది. మొత్తం ఏడు డిపోల్లో కలిపి 681 మంది ఆర్టీసీ డ్రైవర్లు, 427 మంది అద్దె బస్సు డ్రైవర్లతో పాటు 860 మంది కండక్టర్లు, 204 మంది ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. 2022 సంవత్సరంలో 'ఒక గొప్పమార్పుకు ఇదే శ్రీకారం', 2023లో 'ట్యాక్ట్' పేరిట కార్యక్రమాలు నిర్వహించిన విషయం విదితమే.


శిక్షణలో అంశాలు

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బందిలో దృఢ సంకల్పం, వ్యక్తిత్వ వికాసం పెంపు, రహదారి భద్రత, ప్రయాణికులతో సత్ప్రవర్తన, వస్త్రధారణపై అవగాహన, ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ శిక్షణలో భాగంగా వీడియోలు, ప్రసంగాల ద్వారా వివరిస్తున్నారు. తొలుత డిపోల వారీగా అధికారులకు హైదరాబాద్ బస్ భవన్‌లో శిక్షణ ఇవ్వగా, వారి ఆధ్వర్యాన డిపోల్లో సిబ్బందికి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి.

182 అంశాలపై..


పవర్(పీక్ పర్‌ఫార్మెన్స్ త్రూ ఓనర్‌షిప్ విత్ ఎంపతి రిసాల్వ్) పేరిట ఈ ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతీ డిపోలో రోజుకు 40 మంది చొప్పున ఉద్యోగులకు డిపో మేనేజర్ ఆధ్వర్యాన శిక్షణ ఇస్తున్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 182 అంశాలపై వీడియోలు, చిత్రాలు ప్రదర్శిస్తూ అందులోని సారాంశాన్ని వివరించడమే కాక.. అప్పటికప్పుడే పరీక్ష నిర్వహిస్తున్నారు. అలాగే, స్కిట్ల ప్రదర్శన ద్వారా సిబ్బందిలో సృజనాత్మకతను పెంపొందించే ప్రయత్నం జరుగుతోంది. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఎక్కువ ఫలితాలను సాధించడం, మరింత శక్తి వినియోగం ఆవశ్యకతను ఇందులో వివరిస్తున్నారు.

అవగాహన పెరిగింది..



బాధ్యతగా ఉండడం, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మాట్లాడడమే కాక వ్యక్తిగత క్రమశిక్షణపై ఇచ్చిన శిక్షణ చాలా బాగుంది. నైపుణ్యాలు పెంచుకునేలా వీడియోల ద్వారా అనేక అంశాలను వివరించారు. ఒకేరోజులో వృత్తిగత, వ్యక్తిగత అంశాల అవగాహన ఏర్పడింది.
– ఎస్.కే.మహబూబీ, కండక్టర్, సత్తుపల్లి

నైపుణ్యాల పెంపే లక్ష్యం



ఉద్యోగుల్లో యజమానులమనే భావన ఏర్పడితే మరింత అంకిభావంతో పనిచేస్తారని నైపుణ్యాలు పెంచేలా శిక్షణ ఇస్తున్నాం. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో పాటు అద్దె బస్సు డ్రైవర్లకూ శిక్షణ ఇప్పిస్తున్నాం. సంస్థను ప్రజలకు మరింత చేరువ చేసి ఆదాయాన్ని పెంచడమే లక్ష్యం.
– ఏ.సరిరామ్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

డైరెక్టర్(పా) నియామకం ఎప్పుడో?

- సింగరేణిలో 26 రోజులుగా ఖాళీగానే కుర్చీ
- పెండింగ్‌లో బిల్లులు, ఇతర ఫైళ్లు



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): దక్షిణ భారతదేశానికే తలమానికంగా నిలుస్తున్న సింగరేణి సంస్థలోని కీలకమైన డైరెక్టర్(పా – పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) పోస్టు ఎప్పుడు భర్తీ చేస్తారనే సందిగ్ధత నెలకొంది. ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డికి డైరెక్టర్ (పా)గా యాజమాన్యం నాలుగు మాసాల క్రితం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన పదవీకాలం జనవరి 31తో ముగియగా.. ఆనాటి నుంచి డైరెక్టర్(పా) పోస్టు ఖాళీగానే ఉంటోంది. ఇటీవల డైరెక్టర్ పీపీ, డైరెక్టర్ ఆపరేషన్స్ పోస్టులను భర్తీ చేయగా, ఆ సమయంలోనే (పా) పోస్టు కూడా భర్తీ చేస్తారని భావించినా అలా జరగలేదు. ఫలితంగా కంపెనీకి సంబంధించిన బిల్లులు, ఇతర ఫైళ్ల పేరుకుపోతున్నట్లు సమాచారం.

2014 నుంచి అదనపు బాధ్యతలే..

సింగరేణి సంస్థలో సీఎండీ తర్వాత డైరెక్టర్(పా) పోస్టును కీలకంగా చెబుతారు. దీంతో ఈ పోస్టులో ఐఏఎస్ అధికారిని నియమించాల్సి ఉండగా యాజమాన్యం, ప్రభుత్వం 2014 నుంచి అదనపు బాధ్యతలతోనే కాలం వెళ్లదీస్తున్నాయి. 2011లో ఈ స్థానంలో ఐఏఎస్ అధికారి విజయకుమార్‌ను నియమించగా, తెలంగాణ ఏర్పడ్డాక ఆయనను బదిలీ చేశారు. ఆపై డైరెక్టర్ ఫైనాన్స్‌గా వచ్చిన వివేకానంద, పవిత్రన్‌కుమార్, బలరామ్, ఆ తర్వాత డైరెక్టర్ ఆపరేషన్స్‌గా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్, డైరెక్టర్ పీపీగా పనిచేసిన వెంకటేశ్వరరెడ్డికి డైరెక్టర్(పా)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వచ్చారు. కానీ పూర్తిస్థాయి ఐఏఎస్ అధికారి లేకపోవడంతో కార్మికులకు సంబంధించిన సమస్యలు పేరుకుపోతున్నాయని, పరిపాలనా పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయనే చర్చ జరుగుతోంది. ఈమేరకు ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయి డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరుతున్నారు.

రెండేసి పోస్టులతో ఇబ్బందులు..

సింగరేణిలో నిపుణులైన అధికారులు ఉన్నప్పటికీ జీఎంల నుంచి డైరెక్టర్ల వరకు ఒకే అధికారికి రెండేసి పోస్టులు కట్టబెడుతున్నారు. ఫలితంగా అధికారులు ఏ శాఖకూ పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారనే వాదన వినిపిస్తోంది. ఈ కారణంగా వందలాది ఫైళ్ల పెండింగ్‌లో ఉంటున్నాయని తెలుస్తోంది.

క్లుప్తంగా

కోడిపిల్లకు నాలుగు కాళ్లు..!



నాలుగు కాళ్లతో ఉన్న కోడిపిల్ల

ఇల్లెందురూరల్: సాధారణంగా కోడికి రెండు కాళ్లు మాత్రమే ఉంటాయి. కానీ ఇల్లెందు మండలం బోటిగుంపు గ్రామంలో నాలుగు కాళ్లతో కోడిపిల్ల జన్మించింది. గ్రామానికి చెందిన ఈసాల పాపయ్య ఇంట్లో కోడి వారం రోజుల క్రితం 15 పిల్లలు చేసింది. వీటిలో ఒక పిల్లకు తోక వద్ద వింతగా కనిపించినా వారు పట్టించుకోలేదు. అయితే కోడిపిల్ల చిన్నగా అడుగులు వేస్తున్న క్రమంలో నాలుగు కాళ్లు ఉండడాన్ని బుధవారం గమనించారు. కోడిపిల్లను చూసేందుకు గ్రామస్తులంతా తరలివచ్చారు.

సింగరేణిలో నలుగురు ఎస్టేట్ ఆఫీసర్ల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు ఎస్టేట్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మణుగూరు ఏరియా సీనియర్ ఆఫీసర్ జి.బాబుల్‌రాజును భూపాలపల్లికి, బెల్లంపల్లి ఏరియా నుంచి ఓ.నవనీతను మందమర్రి ఏరియాకు, మందమర్రి ఏరియా నుంచి కె.స్వప్నను మణుగూరుకు, కొత్తగూడెం ఏరియా జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్‌ను కార్పొరేట్ ఏరియాకు బదిలీ చేశారు.

పట్టుబడిన వాహనాలకు నేడు వేలం

కొత్తగూడెంఅర్బన్: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు కొత్తగూడెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎస్.జానయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు మొదలయ్యే వేలంలో ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని సూచించారు. ఈ సమయంలో ఆధార్, పాన్‌కార్డు తీసుకురావాలని పేర్కొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై బుధవారం స్థానిక పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని కొత్త గంగారం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తుండగా సమాచారం మేరకు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 6 కోడి పుంజులు, 7 ద్విచక్రవాహనాలతోపాటు రూ.1,200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని దురదపాడు శివారులోని వాగు నుంచి ఆసుపాక గ్రామానికి రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా మార్గమధ్యలోని మామిళ్లవారిగూడెం జంక్షన్ వద్ద పట్టుకున్నారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూరిల్లు దగ్ధం



విలపిస్తున్న ఈరు దంపతులు

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండాకు చెందిన గుగులోత్ ఈరుకు చెందిన పూరిల్లు ప్రమాదవశాత్తు బుధవారం దగ్ధమైంది. తండాకు చెందిన గుగులోత్ ఈరు, సాల్కి దంపతులు బుధవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో వచ్చేసరికి పూరిల్లు కాలిబూడిద కావడంతో దంపతులు బోరున విలపించారు. అగ్నిమాపక సిబ్బందికి ఘటనా స్థలానికి వచ్చేసరికి పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో ఇంట్లోని ఆరు తులాల బంగారం, రూ.90 వేల నగదు, క్వింటా బియ్యం, 70 కిలోల కందులు, వంట సామగ్రితోపాటు ఇద్దరు పిల్లలకు సంబంధించిన సర్టిఫికెట్లు, భూమికి సంబంధించిన పత్రాలు కాలిపోయాయన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు లకావత్ గిరిబాబు, యల్లంకి సత్యనారాయణ, చాపలమడుగు రామ్మూర్తి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

ఫీజు కడతారా.. ఇంటికెళ్తారా..?

విద్యార్థులపై ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఒత్తిడి

- పరీక్షలు దగ్గరపడుతుండడంతో విద్యార్థుల అవస్థలు
- ఇంటికెళ్లి తల్లిదండ్రులతో వాగ్వాదాలు
- చర్యలు తీసుకోని ఉన్నతాధికారులు



కొత్తగూడెంఅర్బన్: ఫీజు కట్టకపోతే తరగతి గది బయట నిలుచోండి.. ఫీజు కట్టలేదు కదా ఇంటర్నల్ మార్కులు తక్కువగా వేస్తాం.. ఫీజు చెల్లించలేదు కదా పరీక్షలకు అనుమతి లేదు.. లాంటి హెచ్చరికలను ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు తరచూ వినాల్సివస్తోంది. వచ్చేది వార్షిక పరీక్షల సమయం.. విద్యార్థులు ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతుంటే.. ఇదే అదనుగా భావించిన యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులపైనే ఒత్తిడి తెస్తున్నాయి. దీంతో అటు ఫీజుల అంశం.. ఇటు పరీక్షలు.. రెండు కలిపి విద్యార్థులకు అగ్నిపరీక్షగా మారాయి. ఇంటికెళ్లి తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగడంతో వారు అప్పు చేసి మరీ ఫీజులు కడుతున్నట్లు సమాచారం. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షల సమయం ఆసన్నం కాబోతున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులను ఫీజుల పేరుతో ఒత్తిడి చేస్తున్నారు. ఒకవైపు విద్యార్థులు ఫైనల్ పరీక్ష టెన్షన్‌లో ఉంటే ఫీజుల అంశం మరో రకమైన ఒత్తిడి పెంచుతోంది. ఫీజులు చెల్లించలేని విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో తరగతి గదుల బయట నిల్చోబెట్టడం, ఇంటికి పంపడం వంటి చర్యలతో విద్యార్థులు పరీక్షల వేళ మరింత ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో దాదాపు 220కి పైగా ప్రైవేట్ పాఠశాలలుండగా.. అక్కడ ఫీజుల ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. ఇక ఇంటర్మీడియట్‌కు సంబంధించి ఇప్పటికే ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి మొదలుకాక ముందు నుంచే ఇంటర్ విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి మొదలై ఇంకా కొనసాగుతోందని తెలుస్తోంది. దీంతో పాటుగా పలు ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతిలో సబ్జెక్టులు సులువుగా అర్థం చేసుకునేందుకు గానూ తొమ్మిదో తరగతి విద్యార్థుల వద్ద ప్రత్యేక ఫీజులు వసూళ్లు చేస్తూ పదో తరగతి పాఠ్యాంశాల బోధన చేస్తున్నారు. ఫీజులు చెల్లించలేని వారిని తొమ్మిదో తరగతిలోనే ఉంచి.. సిలబస్ రివిజన్ చేయిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖాధికారులు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫీజులకు సంబంధించిన వివరాలను పాఠశాల, కళాశాలల్లో అందరికీ కనిపించే విధంగా బోర్డు ఏర్పాటు చేయాలని ప్రతి సంవత్సరం విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ ఎవరూ పాటించడం లేదని సమాచారం. దీంతో యాజమాన్యాలు తల్లిదండ్రుల నుంచి ఇష్టానుసారంగా ఫీజులను వసూళ్లు చేస్తున్నాయి.

పరీక్షల సమయం..

పదో తరగతి విద్యార్థులకు మార్చి 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్‌కు సంబంధించి 299 పాఠశాలలకు చెందిన 12,282 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. దీంతో పాటు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఇంకా కొనసాగుతున్నాయి. మార్చి 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది ఇంటర్మీడియట్‌కు సంబంధించి మొదటి సంవత్సరం 9,255 మంది, ద్వితీయ సంవత్సరంలో 10,003 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అయితే పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మళ్లీ పాఠశాలలకు, కళాశాలలకు వచ్చే అవకాశం ఉండకపోవడంతో వారి నుంచి ఏడాది కాలపు మొత్తం ఫీజు తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు ఇటీవల ఇంటర్నల్ మార్కులు వేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో అయితే ఫీజులు చెల్లించని వారికి ఇంటర్నల్ మార్కులు తక్కువగా వేస్తామని భయపెట్టడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో ఫీజుల విషయంలో గొడవకు దిగడం లాంటి ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి. దీంతో వారు చేసేదేమీ లేక అధిక వడ్డీలకు అప్పు తెచ్చి ఫీజులు కట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతాప్రమాణాలు పెరిగినప్పటికీ కొందరు పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు వారి పిల్లలను ఇంకా బాగా చదివించాలనే ఆలోచనతో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చేర్చి అప్పుల పాలవుతున్నారు.

ఫీజుల కోసం ఒత్తిడి చేయొద్దు..



జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఫీజుల కోసం ఇబ్బందులకు గురి చేయొద్దు. వారి తల్లిదండ్రులను సంప్రదించి ఫీజుల విషయంపై చర్చించండి. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటాం. పరీక్షల సమయంలో విద్యార్థులను అవస్థలకు గురిచేస్తే ఆ ప్రభావం పరీక్షల ఫలితాలపై పడే అవకాశం ఉంటుంది.

– వెంకటేశ్వరచారి, డీఈఓ

పిరమిడ్ కాదు.. ధాన్యం బస్తాలే !



ఆరుగాలం శ్రమించి పండించిన రైతులు ధాన్యాన్ని విక్రయించగా.. ఇలా బస్తాల్లో నింపి ఒక దానిపై ఒకటి పిరమిడ్ ఆకారంలో పేర్చిన ఈ దృశ్యం కరకగూడెంలోని ఓ రైస్ మిల్లులో కనిపించింది. ఇలా ధాన్యం నిల్వ చేయడంలో కళాత్మకత, కష్టపడి పనిచేసే వ్యక్తుల కృషి కనిపిస్తోందని పలువురు అంటున్నారు. పిరమిడ్ ఆకృతిలో కనిపిస్తున్న ఈ ధాన్యం బస్తాల వరుస అందరినీ ఆకట్టుకుంటోంది.

– కరకగూడెం

రామాలయానికి రూ.12 లక్షల విరాళం



దాతకు రసీదు అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

భద్రాచలం: ఏపీలోని నెల్లూరుకు చెందిన భక్తులు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి రూ.12 లక్షల భారీ విరాళం అందజేశారు. రామాలయానికి చెందిన ప్రచార రథం ద్వారా అక్కడి భక్తుల కోరిక మేరకు ఈనెల 25న సీతారాముల కల్యాణం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నెల్లూరుకు చెందిన సంతోష్–సాహిత్య దంపతులు శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో పుష్పాలంకరణ నిమిత్తం రూ.12 లక్షలు విరాళంగా అందజేశారని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శాశ్వత నిత్యాన్నదానానికి..

శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భద్రాచలం తాతగుడి సెంటర్‌కు చెందిన ఎం.సుశీల రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేయా వారు రసీదు ఇచ్చారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు లింగాల సాయిబాబు, కత్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాకతీయుల కళావైభవ చిహ్నాలు



పల్లాల బావి



గుట్టపై కోట ముఖద్వారం

కాకతీయ రాజులు 16వ శతాబ్దంలో కనకగిరి గుట్టలపై పలు నిర్మాణాలు చేపట్టారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ నిర్మాణాలు ఇప్పుడు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం వరకు కనకగిరి గుట్టలు వ్యాపించి ఉండగా.. గుట్టపై కోట ఆనవాళ్లు, పల్లాల బావి వద్ద వీరభద్రుడి ఆలయం కనిపిస్తాయి. ఈ ఆలయంలో ఏటా మహాశివరాత్రికి స్వామి కల్యాణోత్సవం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే, పల్లాల బావి గత వైభవానికి చిహ్నంగా కనిపిస్తుండగా.. ఈ బావిలో నీటిలో పల్లాలు తేలేవని చెబుతారు. ఇక గుట్ట కింద ఉన్న హస్తాల వీరన్నను గిరిజనులు భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని అటవీ, పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యాన ఎకో టూరిజం కింద అభివృద్ధి చేస్తున్నారు.



గుట్ట కిందహస్తాల వీరన్న విగ్రహం

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

మునగతో లాభాలు..

- చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు
- అంతర, ప్రత్యామ్నాయ పంటగా సాగు
- ఎరువులు, సాగునీటి అవసరం తక్కువ
- ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు



దమ్మపేటలో సాగు చేస్తున్న మునగ పంట

దమ్మపేట: ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన చిన్న, సన్నకారు రైతులు మునగ పంట సాగు చేస్తే ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. వాణిజ్య, ఆహార, ఉద్యాన పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుండగా.. ఖర్చులు పోగా లాభం అంతంతే వస్తోంది. ఈ నేపథ్యంలో చిన్న, సన్న కారు రైతులను ప్రభుత్వం గుర్తించి, వారికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మునగ పంట సాగుకు ప్రోత్సాహకాలను రాయితీల రూపంలో అందజేస్తోంది. పామాయిల్ సాగు తొలిదశలో మునగ పంటను మొదటి మూడేళ్లు అంతర పంటగా సాగు చేయెచ్చు. అంతగా లాభదాయకంగా లేని పత్తి, మొక్కజొన్న, వరి వంటి పంటలకు ప్రత్యామ్నాయంగా మునగను సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందవచ్చు. మునగ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించడానికి కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ జిల్లాలో పలుచోట్ల మునగ పంట సాగును ప్రోత్సాహించేలా అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు. మునగ పంట ఉత్పత్తులను ఆరోగ్యానికి మేలు చేకూర్చే పలు ఆయుర్వేద ఉత్పత్తుల్లో కూడా వినియోగిస్తారని నిపుణులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ పంట

మునగ సాగుకు దాదాపుగా అన్ని రకాల నేలలు అనుకూలమైనవి. ప్రస్తుత పరిస్థితుల్లో నికర లాభం దృష్ట్యా అనేక పంటలకు ప్రత్యామ్నాయంగా మునగ పంటను సాగు చేయవచ్చు. పత్తి, మొక్కజొన్న, వరి వంటి పంటల సాగులో అధిక విద్యుత్, అపరిమిత భూగర్భ జలాలను వినియోగించాల్సి ఉంటుంది. అధిక మొత్తంలో రసాయన ఎరువుల వినియోగం, పంటలపై విషపూరితమైన రసాయనాల పిచికారీ, అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. మునగ సాగుకు రసాయన ఎరువులు, నీటి వినియోగం చాలా తక్కువ. ఈ కారణంగా ఎరువులు, నీటిని ఆదా చేయడమే కాక పెట్టుబడికి అయ్యే ఖర్చు కూడా ఇతర పంటలతో పోలిస్తే తక్కువనే చెప్పవచ్చు.

సాగు విధానం

ఒక ఎకరా మునగ సాగుకు ప్రధానంగా ఒక కేజీ పీకేఎం–1 రకం విత్తనాలు, 1000 పాలిథిన్ సంచులు, సగం ట్రక్కు మట్టి, పావు ట్రక్కు ఇసుక, ఒక ట్రక్కు పశువుల ఎరువు, 100 కేజీల వేప పిండి, 2 కేజీల ట్రైకోడెర్మా, నాలుగు లీటర్ల వేప నూనె, 40 కేజీల జిప్సం కావాలి. వీటికి సుమారుగా రూ.18,000 వరకు ఖర్చవుతుంది. ఒక కేజీ విత్తన సంచిలో సుమారు 2,500 విత్తనాలు ఉంటాయి. ఒక 6X8 పరిమాణం గల పాలిథిన్ సంచిలో మట్టి, ఇసుక, ఎరువు, ట్రైకోడెర్మాలను నిర్ణీత పరిమాణంలో తీసుకుని, ఆ సంచిలో రెండు విత్తనాలను నాటి, వీటిని నర్సరీలో ఆరు వారాల పాటు పెంచుతారు. సంచిలో 6 నుంచి 7 వారాల పాటు పెరిగిన 1000 మునగ మొక్కలను ఒక ఎకరంలో రెండు మీటర్ల దూరం ఉండేలా నాటుతారు.

ప్రోత్సాహక రాయితీలు

మునగ సాగును ప్రోత్సహించడానికి సాగు ప్రారంభం నుంచి విత్తనాల (మొక్కలు) ఖరీదు, మొక్క పడిపోకుండా ఆధారంగా ఊతకర్రలు, పని ప్రదేశంలో వసతులు కల్పించినందుకు గాను రూ.38,000, గుంతలు తవ్వడం, మొక్కలను నాటడం, పంట సస్యరక్షణకు గాను రూ.76,566.. మొత్తంగా తొమ్మిది నెలల కాలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1,14,566ను ప్రభుత్వం ప్రోత్సాహక రాయితీల రూపంలో అందిస్తుంది. ప్రాథమిక దశలో సాగుకు అవసరమైన ఖర్చులను రైతు ముందుగా భరించినప్పటికీ, ఉపాధి హామీ పథకం ద్వారా తిరిగి వాటిని పొందవచ్చును. కాగా, పంట దిగుబడి ఏడు నుంచి ఎనిమిది నెలల్లో ప్రారంభమవుతుంది. ఒక మొక్కకు 15 కాయల దిగుబడి రాగా ఒక కాయకు రెండు రూపాయల చొప్పున మొత్తంగా ఎకరానికి రూ.75 వేలు ఆదాయం లభిస్తుంది. మునగాకు పొడి, గింజల నుంచి తయారు చేసే నూనె ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.

విస్తృత ప్రచారం చేయాలి



నేను సొంతంగా అర ఎకరంలో మునగ పంట రెండు నెలల కిందట వేశాను. ప్రస్తుతం మొక్కలు బాగా ఎత్తుగా, బలంగా పెరిగాయి. వ్యవసాయ శాఖ అధికారుల ప్రోత్సాహంతో ఈ పంట సాగు ప్రారంభించాను. ప్రభుత్వమే ఈ పంట సాగుపై విస్తృతంగా ప్రచారంచేయాలి. సరైన అవగాహన కల్పించాలి.

–తాళ్ల శంకర్‌రావు (సన్నకారు రైతు), దమ్మపేట

అవగాహన కల్పిస్తున్నాం..



మునగ సాగుకు అయ్యే నిర్వహణ, దిగుబడి, రాయితీలు, లాభాలపై చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రాబోయే రోజుల్లో సాగు విస్తీర్ణం పెంచేలా కృషి చేస్తాం. ప్రస్తుతం సాగులో ఉన్న ఇతర పంటలతో పోల్చి చూస్తే, మునగ సాగుకు అయ్యే వ్యయం, నిర్వహణ చాలా తక్కువ. అన్ని రకాల నేలల్లో ఈ పంట సాగు చేయవచ్చు.

–శీలం చంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ

పనులు ముందుకు సాగేనా..?



కిన్నెరసాని - జల్లేరు నదిపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులు

- కిన్నెరసాని – జల్లేరు నదులపై నిలిచిన బ్రిడ్జి పనులు
- రూ.9 కోట్ల వ్యయంతో 2018లో ప్రారంభం
- అటవీ శాఖ అభ్యంతరాలతో ఆగిన వైనం
- తాజాగా మంత్రి తుమ్మల దృష్టికి సమస్య

ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యంత వెనుకబడిన గుండాల–ఆళ్లపల్లి మండలాలను కలిపే కిన్నెరసాని–జల్లేరు నదులపై ఆళ్లపల్లి–మామకన్ను గ్రామాల మధ్య నిర్మిస్తున్న వంతెన పనులు ముందుకు సాగడం లేదు. మామకన్ను నుంచి ఆళ్లపల్లి మీదుగా మర్కోడు–భట్టుపల్లి వరకు రోడ్డు, కల్వర్టులు, కిన్నెరసాని–జల్లేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. ఇందుకు గాను 2018లో ఆర్‌అండ్‌బీ విభాగం ద్వారా 28 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో కిన్నెరసాని–జల్లేరు నదులపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.9కోట్లు కేటాయించారు. 2018లో పనులకు శంకుస్థాపన చేయగా 2022లో అటవీ శాఖ అడ్డుకుంది. పిల్లర్ల నిర్మాణం ప్రారంభమైన కొద్ది రోజులకే.. ఇవి రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నాయంటూ అటవీశాఖ అధికారులు పనులను అడ్డుకున్నారు. దీంతో నాటినుంచి ఆళ్లపల్లి–గుండాల మధ్య రోడ్డుతో పాటు బ్రిడ్జి పనులకు గ్రహణం పట్టినట్టయింది. కాగా, ఆదివారం ఇల్లెందులోని తన అనుచరుడి ఇంటికి వచ్చిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి స్థానిక నేతలు ఈ సమస్యను తీసుకొచ్చారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి ఎస్‌ఈ, ఈఈలతో చర్చించి పనులు సాగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అనుమతి లభించింది

మామకన్ను – ఆళ్లపల్లి మధ్య కిన్నెరసాని – జల్లేరు నదులపై బ్రిడ్జి నిర్మాణానికి అటవీ శాఖ అనుమతి లభించింది. ఇటీవల అటవీ శాఖ ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం అనుమతులు కూడా ఇచ్చారు. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయి.

– వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ

ప్రకృతి గీసిన చిత్రం!

చెట్టు నిండుగా చిగురించినా.. మొత్తం ఆకులు రాల్చినా అందంగానే కనిపిస్తుంది అనడానికి నిదర్శనం ఈ చిత్రం. కొత్తగూడెం పట్టణం ఎంజీ రోడ్‌లో గల భారీ రావి చెట్టు ఆకులన్నీ రాలిపోగా.. ఆరోడ్డున వెళ్లే వారికి ఇలా కనువిందు చేస్తోంది. ఆ రోడ్డున వెళ్లే వారు ఈ చెట్టు వైపు ఆసక్తిగా చూస్తున్నారు. మరి కొందరు చెట్టు వద్ద ఫొటోలు కూడా దిగుతున్నారు.

– చుంచుపల్లి



ఎంజీ రోడ్‌లో పూర్తిగా ఆకులు రాలిపోయిన చెట్టు

శ్రీకాళహస్తిలో మంత్రి తుమ్మల



ఆలయంలో మంత్రి తుమ్మల, తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఏపీలోని శ్రీకాళహస్తిలో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి తనయుడు తుమ్మల యుగంధర్‌తో పాటు కంభంపాటి రామ్మోహన్‌రావు, గరికపాటి మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

సాగర్ కాల్వలో వ్యక్తి గల్లంతు

ఖమ్మంరూరల్: రూరల్ మండలం పల్లెగూడెం వద్ద సాగర్ కాల్వలో బుధవారం రాత్రి గోలి అశోక్(38) గల్లంతయ్యాడు. మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన అశోక్‌కు పదహారేళ్ల క్రితం వివాహం జరగగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లగా సోదరుడి ఇంట్లో ఉంటున్నాడు. కాగా, తన స్నేహితుడు ఆవుల గురుస్వామితో కలిసి సాగర్ కాలువలో స్నానానికి వెళ్లిన అశోక్ ప్రమాదశాత్తు కాలు జారి కాల్వలో పడి కొట్టుకుపోయాడు. దీంతో బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వగా గాలింపు చేపట్టారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

బోనకల్: గత నెల 31వ తేదీన కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటనలో మరో 23మందికి గాయపడగా పరిస్థితి విషమించిన ఇద్దరికి ఖమ్మం మమత ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇందులో లింగం నాగమణి(55) బుధవారం మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.